RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



3 లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :237 సంపాదకులు: కలిచేటి వెంకయ్య గురువారం 23 జులై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ

- భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం
- ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా





**న్యూఢిల్లీ:** ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సిందిగా మిగతా 2లో...

# నీట్ లీకేజీ వ్యవహారం.. కేంద్రం కీలక ప్రకటన

- నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చకు సిద్ధమన్న కిరణ్ రిజిజు – చర్చతోనే విద్యార్థుల్లో విశ్వాసం పెరుగుతుందని వ్యాఖ్య
- విపక్షాలు షరతులు విధిస్తున్నాయంటే చర్చను కోరుకోవడం లేదని అర్థమని వ్యాఖ్య




**న్యూఢిల్లీ:**నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంటులో సమగ్రంగా చర్చించేందుకు తాము సిద్ధమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ అంశంపై సభలో పారదర్శకంగా చర్చించడం ద్వారా విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించవచ్చని ఆకాంక్షించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ కీలక ప్రకటన వెలువడింది. విద్యార్థుల ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని కిరణ్ రిజిజు ప్రకటించారు. పేపర్ లీకేజీ అంశంపై సభలో లోతైన చర్చ జరగాలని తాము కోరుకుంటున్నామని, ఈ సందర్భంగా ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వినిపించవచ్చని సూచించారు. అయితే, చర్చకు షరతులు విధించడం అంటే వారు చర్చను కోరుకోవడం లేదనే అర్థం వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఏ సమస్య నుంచి పారిపోదని, అన్నిటినీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ లేదా అఖిలేష్ యాదవ్ వంటి నేతలు ఎవరైనా ఈ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని, అయితే సభా నిబంధనల ప్రకారమే చర్చ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కేంద్రవిద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. మరోవైపు, నీట్ పరీక్ష లీకేజీపై చర్చ జరిగే తేదీ, సమయాన్ని నిర్ణయించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను ప్రభుత్వం కోరింది.

# నీట్‌ను పూర్తిగా రద్దు చేయాలి

- సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే డిమాండ్
- నీట్ అవకతవకలపై ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు
- విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చాలని టీవీకే డిమాండ్
- రాహుల్ గాంధీ సహా విపక్ష నాయకుల అరెస్టును ఖండించిన టీవీకే



తమిళనాడు:నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేయాలని ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ డిమాండ్ చేసింది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, టీవీకే ఈ డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలను కేవలం వ్యతిరేకించడమే కాకుండా, ఆ ప్రవేశ పరీక్షను సమూలంగా రద్దు చేయాలని టీవీకే స్పష్టం చేసింది. వైద్య విద్యకు సంబంధించిన అంశాలపై రాష్ట్రాలకు పూర్తి అధికారాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసింది. అధికార పక్షమైన డీఎంకే పేరును నేరుగా ప్రస్తావించకుండా, ఆ పార్టీని లక్ష్యంగా చేసుకుంటూ విమర్శలు గుప్పించింది. “నీట్‌ను రద్దు చేస్తాం” అంటూ తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయబోమని టీవీకే పేర్కొంది. 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, అధికారంలోకి వస్తే నీట్‌ను రద్దు చేస్తామని డీఎంకే ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ టీవీకే ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాలోకి మార్చాలని టీవీకే కేంద్రాన్ని డిమాండ్ చేసింది. నీట్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీకి విజయ్ నేతృత్వంలోని పార్టీ తన మద్దతును ప్రకటించింది. అదేవిధంగా, రాహుల్ గాంధీతో పాటు పలువురు విపక్ష నేతల అరెస్టును టీవీకే తీవ్రంగా ఖండించింది.



# ‘అమ్మఒడి’తో జగన్ వెన్నుపోటు..

- ‘తల్లికి వందనం’తో వెలుగులు: కాలవ శ్రీనివాసులు – తల్లికి వందనం పథకం కింద రెండో ఏడాది నిధులు విడుదల
- 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ.10,120 కోట్లు జమ చేశామన్న కాలవ
- ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఈ పథకం వర్తిస్తుందని వెల్లడి

**అమరావతి, సింధూరదర్శిని:**

బడుగు, బలహీన వర్గాల పిల్లల ఉన్నత చదువులకు భరోసా ఇస్తూ, కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘తల్లికి వందనం’ పథకం రెండో ఏడాది నిధులను విజయవంతంగా జమ చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఈరోజు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 67.47లక్షల మంది విద్యార్థుల చదువుల కోసం రూ.10,120 మిగతా 2లో...

# భూ హక్కుల రక్షణే ప్రభుత్వ ధ్యేయం

- ఇకపై ‘22A’ చిక్కుల నుంచి భూములకు విముక్తి
- నిషేధిత జాబితా నుండి భూముల తొలగింపు సరళతరం చేస్తూ కొత్త ఉత్తర్వులు
- పట్టా భూములను 22ఎ జాబితాలో పెడితే సంబంధిత అధికారిపై చర్యలు
- నిషేధిత జాబితా భూమి అని నిరూపించాల్సిన బాధ్యత ఇక ప్రభుత్వానిదే
- గత ప్రభుత్వంలో అనామక కంపెనీకి రిజిస్ట్రేషన్ సేవలు అప్పగించేలా విఫలయత్నం
- డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేకుండా చూసుకుంటాం
- రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్లు,స్టాంపుల శాఖామాత్యులు అనగాని సత్యప్రసాద్



**అమరావతి, సింధూరదర్శిని:**

గత ప్రభుత్వ అక్రమాల కారణంగా వేలాదిమంది రైతులు సామాన్య భూయజమానుల భూములు 22ఏ నిషేధిత జాబితాలో చిక్కుకుని ఎదుర్కొంటున్న తీవ్రమైన ఇబ్బందులకు శాశ్వత చరమగీతం పాడుతూ నిషేధిత జాబితా నుండి భూముల తొలగింపును సరళతరం చేస్తూ కొత్త ఉత్తర్వులను జారీ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అనగాని మాట్లాడుతూ ఆస్తుల నిర్వహణకు పారదర్శకమైన విధానం ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సరళీకృత విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని దీంతో పేదలకు సామాన్యులకు రైతులకు మరింత మిగతా 2లో...

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ
- ధర్మేంద్రను తొలగించకుంటే మోదీ రాజీనామా చేయాలన్న ముఖ్యమంత్రి




**హైదరాబాద్, సింధూరదర్శిని:** నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి మిగతా 2లో...

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవ రాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్ర మానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య



వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శర వేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

# 'అమ్మఒడి'తో జగన్ వెన్నుపోటు..

(మొదటిపేజీ తరువాయి)

కోట్లను నేరుగా 42.70 లక్షల మంది తల్లుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఎలాంటి అవినీతికి తావులేకుండా ఈ ప్రక్రియ పూర్తిచేశామన్నారు.

**ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా వర్తింపు**

గత ప్రభుత్వంలో ఒక ఇంట్లో ఒక్కరికి మాత్రమే పథకం వర్తించేదని, దానివల్ల ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న నిరుపేద కుటుంబాలు ఇబ్బంది పడ్డాయని కాలవ శ్రీనివాసులు గుర్తుచేశారు. కానీ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నామని అన్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద మనసుతో అదనంగా 17,000 మంది అంగన్‌వాడీల పిల్లలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేశారని తెలిపారు.

**జగన్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

గత వైసీపీ ప్రభుత్వంపై కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2019 ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ అమ్మఒడి ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మాట తప్పారని ఆరోపించారు. కేవలం 42 లక్షల మందికే పథకాన్ని పరిమితం చేసి, దాదాపు 25 లక్షల మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాలనలో కేవలం నాలుగుసార్లు మాత్రమే నిధులు ఇచ్చారని, అప్పట్లో బటన్లు నొక్కడం తప్ప లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ కాలేదని విమర్శించారు.

**బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే అధిక ప్రయోజనం**

ఈ పథకం ద్వారా అత్యధికంగా లబ్ధి పొందుతున్నది బడుగు, బలహీన వర్గాల వారేనని కాలవ గణాంకాలతో సహా వివరించారు. లబ్ధిదారులలో 34.89 లక్షల మంది బీసీ విద్యార్థులు, 13.85 లక్షల మంది ఎస్సీలు, 5,010 మంది ఎస్టీలు, 78,928 మంది మైనార్టీ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా, తమ పిల్లలందరికీ తల్లికి వందనం డబ్బులు అందాయని తల్లులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో విద్యా వెలుగులు నింపుతున్న సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లకు పేద కుటుంబాల తరఫున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు.
నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

# భూ హక్కుల రక్షణే ప్రభుత్వ ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

ఊరట లభించనుందని అన్నారు. ఈ నూతన ఉత్తర్వులు గతంలో జారీ చేసిన పాత సర్క్యులర్లు అన్నింటినీ రద్దు చేయడంతో పాటు భూ రికార్డుల్లో అక్రమ మార్పులకు ఆస్కారమిచ్చే మాన్యువల్ ఎంట్రీలకు స్వస్తి పలుకు తుందని అన్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి 'వెబ్‌ల్యాండ్ 2.0' మాత్రమే ఉంటుందన్నారు. నిషేధిత ఆస్తుల యొక్క ఏకైక సెంట్రలైజ్డ్ మరియు అధికారిక డేటాబేస్ నిర్వహణ ఇక రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ ఐజీ వద్ద ఉంటుందని అన్నారు. 18-06-1954 నాటికి ముందు అసైన్ చేసిన భూములు, సుప్రీంకోర్టు ఉత్తర్వులకు లోబడి దేవాలయాలు లేదా వక్ఫ్ బోర్డుల నుండి చట్టబద్ధంగా వేలంలో కొనుగోలు చేసిన భూములు, విలేజ్ సర్వీస్ ఇనాంలు, షరతులతో కూడిన పట్టా భూములు, పాత కాలంనాటి అన్-అప్రూవ్డ్ లేఅవుట్ల భూములను 22ఏ నిషేధిత జాబితా నుండి పూర్తిగా తొలగిస్తున్నామని అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అలాగే గ్రామకంఠం భూములు ఎట్టి పరిస్థతుల్లోనూ 22ఏలో పెట్టకూడదన్నారు. ఏపీఎస్ఎఫ్సీ వేలంలో కొన్న భూములు 22ఏలో ఉంటే తొలగించాలని కొత్త ఉత్తర్వుల్లో పేర్కొన్నామన్నారు. నిర్ణీత విస్తీర్ణం మించిన ఆస్థులను నిషేధిత జాబితాలో పెట్టేందుకు ప్రభుత్వమానికే అథారిటి ఉంటుదని గ్రామంలో అయితే ఎకరం, పట్టణాల్లో అయితే వెయ్యి చదరపు గజాలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మంత్రి సత్యప్రసాద్ స్పష్టం చేశారు. నిషేధిత ఆస్థుల జాబితాలో ఉన్న భూమికి సంబంధించి కోర్టులు ఆదేశాలు ఇస్తే 5 రోజుల లోపు రెవెన్యూ అధికారులకు తెలియపర్చాల్సి ఉంటుందన్నారు. ఏదైనా భూమి పట్టాభూమి కాదు ప్రభుత్వ పరిధిలోకి వచ్చే భూమి అని నిరూపించాల్సిన బాధ్యత ఆ సంబంధిత పౌరులది కాదని ప్రభుత్వానిదేనని అన్నారు. ఏ ఆస్తినైనా 22ఏ లో చేర్చేముందు సబ్ డివిజన్ పూర్తిచేసి భూ యజమానికి డిజిటల్ డెలివరీ, రిజిస్టర్డ్ పోస్ట్, ఇంటికి నోటీస్ అంటించడం ద్వారా ముందస్తు షోకాజ్ నోటీస్ ఇవ్వడం తప్పనిసరి చేశారని తెలిపారు. అభ్యంతరాల సమర్పణకు పౌరులకు 30రోజుల గడువుతో పాటు లాయర్ల ద్వారా వాదనలు వినిపించడానికి మరో 14 రోజుల ప్రత్యేక సమయం ఇచ్చి విచారణ అనంతరం అధికారి రికార్డుల్లో నమోదయ్యేలా కారణాలతో కూడిన 'స్పీకింగ్ ఆర్డర్' జారీ చేయాల్సి ఉంటుందని వివరించారు. 22ఏలో భూములను చేర్చే, తొలగించే అధికారాన్ని కేవలం సబ్-కలెక్టర్, ఆర్డీఓ స్థాయి అధికారులకు మాత్రమే పరిమితం చేస్తూ వారి నిర్ణయంపై అభ్యంతరాలుంటే జిల్లా జాయింట్ కలెక్టర్ కి అప్పీల్ చేసుకునేందుకు ఆ తర్వాత ప్రభుత్వానికి రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు పారదర్శకమైన అప్పీలు వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ జరుగుతోందంటూ వైసిపి నేతలు చేస్తున్న కుట్రపూరిత ప్రచారాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రంగా ఖండించారు. పీపీపీ మోడల్‌లో ప్రయివేట్ భాగాస్వామి కేవలం భవనాలు, ఆధునిక ఫర్నిచర్, కంప్యూటర్లు, క్యూ మేనేజ్‌మెంట్ వంటి నాన్-స్టాట్యుటరీ మౌలిక వసతుల కల్పనకు మాత్రమే పరిమితమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 297 కార్యాలయాల్లో కేవలం జిల్లా కేంద్రాల్లోని 26 ఆఫీసుల్లో మాత్రమే దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తున్నామని తెలిపారు. దస్తావేజుల పరిశీలన, రిజిస్ట్రేషన్లు, స్టాంప్ డ్యూటీ వసూలు, చట్టబద్ధమైన నిర్ణయాధికారాలన్నీ 100 శాతం ప్రభుత్వ సబ్-రిజిస్ట్రార్ పరిధిలోనే ఉంటాయని, డాక్యుమెంట్ రైటర్ల వృత్తికి, వారి కుటుంబాల ఉపాధికి రూపాయి నష్టం కూడా జరగకుండా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం అనామక కంపెనీకి రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను రూ.90కోట్లకు అప్పగించాలని ప్రయత్నించిందని అయితే ఆకంపెనీకి ఉన్న అసమర్థత కారణంగా వాటిని ఏర్పాటుచేయడంలో విఫలమయిం దని అన్నారు. తమ ప్రభుత్వం రెండేళ్ల పాటు అధ్యయనం చేసి ఉత్తమ పద్దతుల్లో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుంటే ఆపార్టీ విష ప్రచారం చేస్తోందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో విజయ వంతం అయిన విధానాలను మన రాష్ట్రంలో అమలు చేయటం వల్ల పరిపాలన మరింత సౌలభ్యవంతంగా మారుతుందని, ప్రజలకు పారదర్శక మైన, వేగవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో అమలు జరుగుతున్న విధానాలను అధ్యాయనం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రీ సర్వే పై చేస్తున్న విమర్శల్లో నిజం లేదని మంత్రి అనగాని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రీ సర్వేను తప్పుల తడకగా నిర్వహించిందని ఇప్పటికీ కూడా ఆ తప్పులను సరి చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం రీ సర్వేకు సరైన సమయం ఇవ్వలేదని కానీ కూటమి ప్రభుత్వంపాలనలో రీసర్వేకు 200కి పైగా రోజులు కేటాయించామని గ్రౌండ్ ట్రూతింగ్‌కే 90 రోజులు కేటాయించామని సర్వే అధికారులు వంద రోజుల పాటు గ్రామాల్లోనే ఉండి రీ సర్వేను నిర్వహిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం రీ సర్వేకు కేవలం వంద రోజులు మాత్రమే కేటాయించి తప్పుల తడకగా మార్చిందని తమను కూడా అలాగే చేయమని వైసీపీ నాయకులు చెబుతున్నారా అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు. ఈసమావేశంలో రాష్ట్ర రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజి డా. బిఆర్. అంబేద్కర్ పాల్గొన్నారు.

# జగన్‌కు పొగాకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

**నీ హయాంలో కంటితుడుపు చర్యలే -- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫైర్**

**రైతుల కోసం పని చేసింది టీడీపీ ప్రభుత్వం... రైతులను గాలికొదిలింది జగన్ ప్రభుత్వం**

**నాడు మార్కెట్ జోక్యంతో రైతులను ఆదుకున్నాం... నేడు రూ.300 కోట్లతో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు చేశాం**

**ఇప్పుడు ఎఫ్ సీ వీ పొగాకు రైతులకు అండగా నిలుస్తున్నాం**

**నీ హయాంలో రైతులు విలవిల్లాడితే చూస్తూ ఊరుకున్నావు... ఇప్పుడు మమ్మల్ని విమర్శించే అర్హత ఎక్కడిది?**



అమరావతి, సింధూరదర్శిని: పొగాకు రైతుల సంక్షేమం కోసం నిజంగా పనిచేసింది తెలుగుదేశం ప్రభుత్వం, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాత్రమేనని, రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు నీతులు చెప్పడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఏమాత్రం తగదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. జగన్ హయాంలో పొగాకు రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయినా స్పందించలేదని, చేసిన కొనుగోళ్లు కూడా కేవలం కంటి తుడుపు చర్యలుగా మాత్రమే మిగిలిపోయాయని మండి పడ్డారు. రైతుల కష్టాలు పట్టించుకోకుండా ఐదేళ్లు గడిపిన జగన్... ఇప్పుడు రైతులపై ప్రేమ ఒలకబోస్తూ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా జోక్యం చేసుకుని పొగాకు రైతులను ఆదుకున్నామని మంత్రి గుర్తు చేశారు. 2014-15 పంట సీజన్‌లో పొగాకు కిలోకు రూ.20 చొప్పున ధరల పరిహారం అందించామని తెలిపారు. అయితే 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కేవలం 12.93 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేయటం తప్పా , రైతులకు నిజమైన ఉపశమనం కలిగించే విధంగా మార్కెట్‌లో సమర్థవంతమైన జోక్యం చేయలేకపోయిందన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయిన సమయంలో వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పొగాకు రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని చర్యలు ప్రారంభించిందని మంత్రి తెలిపారు. గత ఏడాదిలోనే సుమారు 35 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును రూ.300 కోట్ల విలువతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. అదే విధంగా వర్జీనియా పొగాకు రైతుల సమస్యల పరిష్కారంలో కూడా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిపై కేంద్ర వాణిజ్య ఉ పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ వెంటనే స్పందించి, పొగాకు కొనుగోలు చేస్తున్న అన్ని కంపెనీలకు రైతుల వద్ద ఉన్న మొత్తం వర్జీనియా పొగాకు పంటను కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్ సీ వీ పొగాకు రైతులను ఖచ్చితంగా అదుకుంటామని, కేంద్ర మంత్రి ఆదేశాలకు కంపెనీలు కూడా సానుకూలంగా స్పందించి రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకును కొనుగోలు చేసేందుకు అంగీకారం తెలిపాయని చెప్పారు. జగన్ సిండికేట్‌ల గురించి మాట్లాడటం హాస్యాస్పదం. నీ పాలనంతా దోచుకోవడం, దాచుకోవడం, సిండికేట్ రాజకీయాలకే పరిమితమైనందున అందరూ అలాగే వ్యవహరిస్తారని భ్రమపడుతున్నావు. అదే నీ రాజకీయ ఆలోచనా విధానానికి నిదర్శనం. రైతుల ప్రయోజనాల కోసం పారదర్శకంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలి.

వర్జీనియా పొగాకు ధరల పతనం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల కాదు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గుదల, ఎగుమతులపై ఏర్పడిన ప్రతికూల ప్రభావం, దేశీయంగా జీఎస్టీ పెరుగుదల వంటి అనేక జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలే దీనికి ప్రధాన కారణాలు. ఈ వాస్తవాలను తెలిసినా ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం జగన్ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే, ఐదేళ్ల నీ పాలనలో పొగాకు రైతుల కోసం ఏం చేశావో ప్రజలకు చెప్పడం మంచిది. ఇప్పుడు రైతుల సంక్షేమంపై నీతులు చెప్పడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నావా? లేక తెలిసే రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారం చేస్తున్నావా? అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. రైతుల కష్టాలను రాజకీయాలకు వాడుకోవడం మానేసి, నిజాలను అంగీకరించే ధైర్యం చూపాలని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్‌కు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు.

# ఎస్.ఐ.ఆర్ లో భాగస్వామ్యం కావాలి

నరసరావుపేట, సింధూరదర్శిని: ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ంచిందని, ఇందులో రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ కృత్రిక శుక్ల కోరారు. ఎస్.ఐ.ఆర్ పై జిల్లా కలెక్టర్ కార్యాలయం లోనే వీడియో సమావేశ మందిరంలో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ఈ నెల 24వ తేదీ వరకు ఇంటింటికి సందర్శిస్తారని చెప్పారు. జూలై 31వ తేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని అన్నారు. జూలై 31వ తేది నుండి ఆగస్టు 30వ తేదీ వరకు క్లెయిమ్ లు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 28వ తేదీ లోగా క్లెయిమ్ లు, అభ్యంతరాలు పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. అక్టోబర్ 3వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. జూలై 24వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల మార్పు, హేతుబద్ధీకరణ చేయుటకు అవకాశం ఉందని తెలిపారూ. జిల్లాలోని ఏ డు నియోజకవర్గంలో మొత్తం 17,41,798శ్రీ మందికి ఏ న్యూమరేషన్ ఫారాలు అందించడం జరిగిందని, 1553377(89 శాతం) డిజిటలైజేషన్ చేయటం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి అద్దయ్య, , తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు బి విశ్వేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి పి నాగేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి సిహెచ్ ఆదినారాయణ రావు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి ఫిదాయత్ఖాన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్ఎం భాష, ఏఐఎంఐఎం ప్రతినిధి కే. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ ఎగుమతికి ఆమోదం కలిగిన మామిడి ఉత్పత్తులు పండించండి

## జాతీయ మామిడి దినోత్సవంలో జాయింట్ కలెక్టరు గోవింద రావ్

తిరుపతి (సింధూర దర్శిని) 22 జూలై తిరుపతి జిల్లా ; రాష్ట్రీయ సేవా సమితి (రాస్), కృషి విజ్ఞాన కేంద్రం, తిరుపతి వారు కోకా కోలా ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో బుధవారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, కరకంబాడి నందు "జాతీయ మామిడి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించినట్లు కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టరు ఆర్. గోవింద రావ్ మరియు రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, తిరుపతి జిల్లా ఉద్యాన అధికారి జయ భరత్ రెడ్డి, నాబార్డు, జిల్లా అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ సామాజిక ప్రకృతి వ్యవసాయ పథకం సంచాలకులు షణ్ముగం, రాస్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి 250 పైగా రైతులు, రైతు మహిళలు మరియు వ్యవసాయ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా రైతులు, అధికారులు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన సందర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా జాయింట కలెక్టరు ఆర్. గోవింద రావ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట అయిన మామిడిలో కోకా కోలా ఇండియా ఫౌండేషన్ వారి సహకారంతో ఉన్నతి మ్యాంగో పథకం ద్వారా జిల్లాలోని రైతుల ఆదాయం పెంచటానికి రాస్ మరియు కృషి విజ్ఞాన కేంద్రం వారు చేపట్టిన కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రైతులు విదేశీ ఎగుమతులకు ఆమోదయో గ్యమైన మామిడి ఉత్పత్తులు పండించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది కృషి విజ్ఞాన కేంద్ర యొక్క సేవల గురించి రైతులకు




తెలియచేయాలని అన్నారు. రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ "ఉన్నతి మ్యాంగో" పథకం ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి తెలిపి, రైతులు రసాయన అవశేష రహిత మామిడి పంట పండించటం ద్వారా అధిక మార్కెట్ ధర పొందటమే కాక సాగు ఖర్చు కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు, అదేవిధంగా మామిడిలో కొమ్మ కత్తిరింపులు, పాత తోటల పునరుద్దరణ, తల మార్పిడి మొదలైన సాంకేతికతలు పాటించటం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. చంద్రశేఖర్, డి.డి. ఎం, నాబార్డు వారు మాట్లాడుతూ మామిడి రైతుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి నాబార్డు వారు అందిస్తున్న వివిధ రాయితీ పథకాలు, పంట భీమా పథకాలు గురించి తెలుపుతూ, రైతులు మామిడి విలువ జోడింపు పై దృష్టి సారించాలని అన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర హెడ్, డా. ఎస్,శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయ మామిడి దినోత్సవ ప్రాముఖ్యత, మామిడిలో నాణ్యమైన, అధిక దిగుబడులు పొందటానికి ఉపయోగపడే కాయ తొడుగులు, పండు ఈగ బుట్టలు, జీవ సంబందిత పురుగుమందుల వినియోగం, ప్రస్తుత ఎల్ నీనో పరిస్థితులలో సాగులో ఉన్న పంటలలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ మామిడిలో కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్యం, ఎల్ నీనో పరిస్థితులలో ఉద్యాన పంటలలో పాటించవలసిన జాగ్రత్తలు, మామిడిలో వివిధ రకాలు మొదలైన అంశాల గురించి తెలియచేసారు.

కార్యక్రమంలో తరువాత ఉన్నతి మ్యాంగో పథకంలో భాగంగా మామిడిలో మంచి దిగుబడులు సాదించిన రైతులకు అతిథుల చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందచేసి, మామిడి సాగు పై కె.వి.కె వారి ప్రచురణ విడుదల చేశారు. అదేవిధంగా ప్రదర్శనా క్షేత్రాల నిమిత్తం రైతులకు వరి విత్తనం, పురుగు మందులు, జీవన ఎరువులు, షెడ్యూల్డ్ కులాల రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు.



# ఇసుక రోడ్లపై పడకుండా డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

### - కమిషనర్ వై ఓ నందన్ -

నెల్లూరు (సింధూర దర్శిని) 22 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక రవాణా సమయంలో నిర్దేశించిన ప్రమాణాలు పాటించని వాహనదారులపై మున్సిపల్ యాక్ట్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వై.ఓ నందన్ హెచ్చరించారు. స్థానిక పొర్లు కట్ట ప్రాంతం ఇసుక రీచ్ నుంచి పొట్టేపాలెం ఇసుక రీచ్ ప్రాంతం వరకు కమిషనర్ బుధవారం పర్యటించి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడారు. పరిమితికి మించి ఇసుక తరలింపు సమయంలో రోడ్లపై పేరుకుపోయిన ఇసుకను ట్రాక్టర్ డ్రైవర్లకు కమిషనర్ ప్రత్యక్షంగా వీడియో చూపించి వివరణ అడిగారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా ఇసుకను తరలిస్తూ రోడ్లపై ఇసుక మేటలు వేసేలా వాహనాలు నడుపుతున్నారని, ఉదయం వేళకు ఆ ఇసుకను రోడ్లపై నుంచి తొలగించేందుకు పారిశుధ్య కార్మికులకు అదనపు పనిభారం పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తరలింపు సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లను కమిషనర్ హెచ్చరించారు. కంకర, ఇసుక తదితర భవన నిర్మాణ సామాగ్రి తరలించే సమయంలో లారీలు, ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు ఇతర వాహనాలపై పూర్తిస్థాయిలో నగరపాలక సంస్థ నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా వాహనాల యజమానులు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు.

# గురు పౌర్ణమి వేడుకలు ప్రారంభం



గూడూరు (సింధూర దర్శిని) 22 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం నుండి 29వ తేదీ వరకు ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి ఎక్కడ నామ సప్త పారాయణ ప్రతి రోజు పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు .గూడూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి బాబా వారికి విశేష అలంకరణ ఏర్పాటు చేశారు ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి అఖండ నామ సప్తాహం ప్రారంభమైంది ఈనెల 29వ తేదీ వరకు నామ సప్తాహం నిరంతరాయంగా కొనసాగనుంది కమిటీ సభ్యులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా బుధవారం నుండి 29వ తేదీ వరకు ప్రతిరోజు పల్లకి సేవ జరుగుతుందని 29వ తేదీ గురు పౌర్ణమి సందర్భంగా సాయి సత్య వ్రతం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

# ప్రతిపక్ష నాయకుల పై దురుసు ప్రవర్తన బాధాకరం

### గూడూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు



గూడూరు (సింధూర దర్శిని) 22 జూలై నెల్లూరు జిల్లా ; రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా గూడూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గూడూరు: రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీల అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని టర్ క్లాక్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడం, ఆయన పట్ల దురుసుగా వ్యవహరించడం దారుణమని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్ష నాయకులపై ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదని వారు అన్నారు. అదేవిధంగా, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పంట శ్రీనివాసులు రెడ్డి, పూల చంద్ర శేఖర్, డాక్టర్ రామకృష్ణయ్య, వేమయ్య, మురారి కృష్ణయ్య, సుబ్బారావు, ఫయాజ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాన్ని యధావిధిగా కొనసాగించాలి: అఖిల పక్ష నాయకులు డిమాండ్

గూడూరు( సింధూరదర్శిని) 22 జూలై నెల్లూరు జిల్లా ; కోట బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని అఖిల పక్ష నాయకులు జి.శశి కుమార్ , వై .సునీల్ లు అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద అఖిల పక్ష నాయకులు నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా జి. శశి కుమార్ , వై. సునీల్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, ఎంతో మంది ఉన్నతికి తోడ్పడిన కోట అంబేద్కర్ గురుకుల పాఠశాలను సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మూసివేయడం దారుణమన్నారు.. సుమారు 600 మంది విద్యార్థుల భవిష్యత్ గందరగోళం అయింద న్నారు. సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కు అవసరమైన కొత్త భవనాలు, ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలాలను కేటాయించే ఆలోచన చేయాలని కోరారు. తరలింపు నేపథ్యంలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు , తల్లి దండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. అనంతరం



అఖిల పక్ష నాయకులు జడ్డా వెంకటరమణయ్య, డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ గురుకుల పాఠశాలను సెంటర్ ఆఫ్ ఎక్సెన్స్ నెపంతో ఎత్తి వేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు వలన వందల మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారిందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి యధావిధిగా గురుకుల పాఠశాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు జమాలుల్లా, సి.వి.ఆర్ కుమార్, నారాయణ, రమేష్, గోపి ,ఎల్.వి.సుబ్బయ్య, భాస్కర్ గౌడ్, వెంకటేశ్వర్లు రాజు, వేగూరు విజయ కుమార్,షఫీ, మౌలానా, ఫయాజ్, ఇబ్రహీం, వేమయ్య, అంకయ్య, హిదాయతుల్లా, ఇబ్రహీం మౌలానా, మస్తానయ్య, రిజ్వాన్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బందికి 'మెదడు ఆరోగ్యం'పై అవగాహన సదస్సు

### ఉచిత వైద్య శిబిరం నిర్వహణ



నెల్లూరు ( సింధూర దర్శిని) 22 జులై నెల్లూరు జిల్లా ; ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా "అందరికీ మెదడు ఆరోగ్యం " అనే ప్రధాన అంశంతో, జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు కిమ్స్ హాస్పిటల్, నెల్లూరు వారి సహకారంతో పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రత్యేక మెదడు ఆరోగ్య అవగాహన సదస్సు, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ సి.హెచ్. సౌజన్య ముఖ్య అతిథిగా విచ్చేసారు. పోలీసు విధుల్లో నిరంతరం ఎదురయ్యే మానసిక ఒత్తిడి, రాత్రి వేళల్లో విధులు, అత్యవసర పరిస్థితుల్లో పనిచేసే నేపథ్యంలో ప్రతి పోలీసు ఉద్యోగి తన మెదడు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె సూచించారు. ఆరోగ్యవంతమైన పోలీసు వ్యవస్థ ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలను అందించగలదని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్, నెల్లూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజీ, న్యూరో సర్జరీ వైద్య నిపుణులు పోలీసు అధికారులు, సిబ్బందికి మెదడు సంబంధిత వ్యాధులు, వాటి నివారణ, ముందస్తు జాగ్రత్తలు, చికిత్సా విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అధిక రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం, ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని వివరించారు.

ఈ సందర్భంగా శివ కృష్ణారెడ్డి , అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడంలో అత్యంత కీలకమైన సి.పి.ఆర విధానంపై కిమ్స్ వైద్య బృందం ప్రత్యక్ష డెమో నిర్వహించినారు. గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన వ్యక్తికి వైద్య సిబ్బంది వచ్చే వరకు ఎలా స్పందించాలి, ఛాతిపై ఒత్తి ఎలా చేయాలి, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి అనే అంశాలను ప్రాక్టికల్‌గా వివరించి పోలీసు సిబ్బందికి శిక్షణ అందించారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ వైద్య బృందం పోలీసు అధికారులు, సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డా. జి. సంగమిత్ర (సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్), డా. వి. అభినయ రెడ్డి (కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్), డా. సి. కృష్ణ మోహన్ (సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్), డా. వి. సాయి భరత్ (కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్), డా. జి. సాయినాథ్ (కన్సల్టెంట్ న్యూరో సర్జన్) పాల్గొని మెదడు ఆరోగ్యంపై విలువైన సూచనలు, సలహాలు అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొని వైద్య నిపుణులు అందించిన సూచనలు, అవగాహన కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. జిల్లా పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు సహకరించిన కిమ్స్ హాస్పిటల్, నెల్లూరు యాజమాన్యానికి, వైద్య బృందానికి అదనపు ఎస్పీ అప్పా రావు, రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు మరియు డిఎస్పీ చంద్ర మోహన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ – ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలి**



తిరుపతి (సింధూర దర్శిని) 22 జూలై తిరుపతి జిల్లా ; జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కు సంబంధించిన సమస్యల పట్ల స్వయంగా తనిఖీ చేసి తక్షణమే పరిష్కారం చూపుతూ నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్‌పర్సన్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, సత్యవేడు మరియు సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, నెలవల విజయశ్రీ లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని తహశీల్దార్లు, మండల అధికారులు, సంబందిత అధికారులు వర్చువల్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆయా శాఖల సమాధానాలను పరిశీలించిన అనంతరం, జాప్యం జరిగిన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులు త్వరితంగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. డీవీఎంసీ లో ప్రస్తావించే ప్రతి అంశానికి అధికారులు పరిష్కారం చూపాల్సిన భాధ్యత ఉందని, సివిల్ రైట్స్ డే ప్రతి నెలా జరిపి ఎస్సీ/ఎస్టీ సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చూపేలా న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల ఇళ్లకు సంబంధించి పట్టాలు మంజూరు, భూ సమస్యలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనం నిర్మాణం వంటి సమస్యలపై కమిటీ సభ్యులు విన్నవించుకోగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయింపు విషయంలో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు గృహాలు మంజూరు సంబంధించిన స్థలాన్ని గుర్తించడం, మంజూరు చేయడం వంటి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి గృహాలను మంజూరు చేయాలని హౌసింగ్ డిపార్ట్మెంట్ వారినీ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలాలు, సంక్షేమ హాస్టల్ లలో ఆర్వో వాటర్ ప్లాంట్లు లేని చోట ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే పాతబడిన భవనాల స్థానంలో కొత్త వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి అనుమతులు కొరకు పంపాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో గల ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలనీ సంబందిత అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాలలకు విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న రహదారి సమస్యను పరిష్కరించి, అవసరమైన బైపాస్ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించి నివేదిక సమర్పించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఎం.ఎల్.సి బల్లి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ వాకాడు, చిట్టమూరు మండలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో వాకాడు, చిట్టమూరు మండలాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని జిల్లాల పునర్విభజన తర్వాత నెల్లూరు జిల్లాలోకి వెళ్లిన వాకాడు, చిట్టమూరు మండలాల అభివృద్ధిని విస్మరించవద్దన్నారు. అంబేద్కర్ భవనాల నిర్మాణం, పాత సంక్షేమ హాస్టళ్లు, పాఠశాల భవనాల కూల్చివేత, 2008కు ముందు నిర్మించిన ప్రభుత్వ గృహాల పరిస్థితిపై సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి సురక్షిత తాగునీరు అందేలా ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, డోనర్ యాప్ ద్వారా అవసరమైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని కోరారు. తిరుపతి, తిరుమలకు దీర్ఘకాలిక తాగునీటి అవసరాలను తీర్చే ఆల్తూరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు రూ.743 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు కావడం హర్షణీయమన్నారు. ప్రాజెక్టు భూసేకరణ సమస్య పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన జిల్లా కలెక్టర్, ఆర్డీవోతో పాటు ముఖ్యమంత్రి, సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ రహదారి సమస్యలు, అట్రాసిటీ కేసులు, భూ ఆక్రమణలు, శ్మశాన వాటికలకు స్థలాలు, రోడ్డు మార్గాలు, ఎస్ సి , ఎస్.టి లకు సంబంధించి ఇంటి పట్టాలు లేని వారికి ఇంటి పట్టాల మంజూరు, ఎప్పటి నుండి సాగు చేస్తూ వ్యవసాయ పట్టాలు లేని వారికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు మంజూరు, అంబేద్కర్ భవనాల నిర్మాణానికి స్థలాలు, నిధుల మంజూరు, ఎస్.సి, ఎస్.టి కుటుంబాలు నివసించే ప్రదేశాలలో కరెంటు, త్రాగు నీరు ఇతర మౌలిక వసతుల కల్పన తదితర సమస్యల పై కమిటీ నందు ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, జిల్లాలోని డీఎస్పీలు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓ లు రామ్మోహన్ , భాను ప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శివశంకర్ నాయకబ్, , జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి హరీష్, బిసి వెల్ఫేర్ డిడి భరత్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాజా సోము, డి ఆర్ డి ఏ పిడి శోభన్ బాబు, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, డీఈవో కుమార్, భూగర్భ గండ శాఖ అధికారి బాలాజీ నాయక్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్సీ చంద్రశేఖర్ రావు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, ఐసిడిఎస్ పిడి వసంత భాయ్, డీఎస్ఓ శేషాచల రాజు, నాయుడుపేట, పుత్తూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట మునిసిపాలిటీల కమీషనర్ లు ఎస్.కె. ఫజిలుల్లా, నాగేశ్వర రావు, కిరణ్, కృష్ణా రెడ్డి, చెన్నయ్య, డీవీఎంసి సభ్యులు, జిల్లా అధికారులు, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## - ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ -






బాపట్ల, ( సింధూర దర్శిని): నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా జి.బి.సి. రోడ్డులోని మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహ సర్కిల్ నుండి కమ్మ కళ్యాణ మండపం వరకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వాసుదేవ్ వినోద్‌షె కుమార్ తో కలిసి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ముఖ్య అతిథులుగా హాజరై, మొక్కలు నాటారు. ఈ సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని బాపట్ల పట్టణాన్ని పచ్చదనంతో నింపేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని బైపాస్ డివైడర్లపై కంపెనీల సామాజిక బాధ్యత నిధుల సహకారంతో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కూడా సంబంధిత సంస్థలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పచ్చ దనం పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, వ్యాపార సంస్థలు మొక్కల పెంపకంలో భాగస్వాములై బాపట్లను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. అనంతరం 410 మొక్కలు అందజేసిన దాత తిరువీధుల వాణి ని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్ర మంలో ఆర్డీఓ.ఏ హరి కుమార్, డ్వామా పి.డి విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ యం. హాసిని,తహశీల్దార్ షేక్ సలీమ, నేచర్ వెల్ ఫర్ కౌన్సిల్ చైర్మన్ అవల వెంకటేశ్వర్లు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, నాటక అకాడమీ డైరెక్టర్, బాపట్ల పట్టణ అధ్యక్షుడు మందపాటి ఆంద్రెయ,బ్రాహ్మణ సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ చివుకుల దుర్గ ప్రసాద్, సగర కార్పోరేషన్ డైరెక్టర్ దుంపల సుబ్బారావు,బెస్త కార్పోరేషన్ డైరెక్టర్ చాపా సోమయ్య ,మానవతా సేవ సంస్థ బాపట్ల సభ్యురాలు కర్పూరపు మంజులత,నేచర్ వెల్ ఫేర్ సొసైటీ మెంబర్ దేవర కొండ రాము, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమిషనర్ సమీక్ష

నెల్లూరు ( సింధూర దర్శిని) 22 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగంలో భవన నిర్మాణ అనుమతులను సరళీకృతం చేశారనీ, అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా నిరంతరం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. ఎల్.ఆర్.ఎస్ పథకం అమలుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని, పథకం ద్వారా కలిగే లబ్ధిని గురించి విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన, ప్రచారం కల్పించాలని సూచించారు. ప్లానింగ్ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న ఎల్.ఆర్.ఎస్ పాటర్న్లు పరిశీలించి వెంటనే తదుపరి అనుమతుల కొరకు అధికారులకు పంపవలసిందిగా ఆదేశించారు. విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరు నిబద్ధత పాటించి టౌన్ ప్లానింగ్ విభాగం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు ప్రతి ఒక్క టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి, సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శి కృషి చేయాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నక్ష ప్రాజెక్టు పనుల పురోగతిని మరింత వేగవంతం చేసి నిర్దేశించిన సమయంలో గా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. నక్ష ప్రాజెక్టు నిర్వాహణకు కేటాయించిన సిబ్బంది అందరూ విధుల నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించి ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో నెల్లూరు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘు నాథరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ లు వేణు, సతీష్, సూపరిండెంట్ ప్రవీణ్ కుమార్, టీ.పీ.బి.వోలు, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులపై విచక్షణ రహితంగా లాఠీచార్జ్ బాధాకరం



గూడూరు (సింధూర దర్శిని) 22 జూలై నెల్లూరు జిల్లా ; నీట్ పరీక్ష లీకేజీ పై ఢిల్లీలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థినీ విద్యార్థులపై ప్రభుత్వం లాటి చార్జ్ చేయడం అమానుషమని విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని గూడూరు సిపిఐ నాయకులు కుమార్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీ మరియు ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ నాయకులు కుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్షా లీకేజీ తో అనేకమంది ఆత్మహత్య చేసుకున్నారని వారికి న్యాయం చేయాలని కోరుతూ లక్షలాది మంది విద్యార్థులు చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారని అన్నారు. ప్రభుత్వం వారిపై విచక్షణారహితంగా లాటి చార్జ్ చేయడం బాధాకరమని విద్యార్థులు సరైన సమయంలో ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని ఇప్పటికైనా విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సునీల్, జమాల్, భాస్కర్ గౌడ్ ,ఎల్వి సుబ్బయ్య, శశి, విజయ్ కుమార్, ఫయాజ్,తదితరులు పాల్గొన్నారు .

# శివపార్వతులకు ప్రత్యేక పూజలు



గూడూరు ( సింధూర దర్శిని) 22 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో ఉన్న శ్రీ మీనాక్షి దేవి సమేత సోమేశ్వర ఆలయంలో బుధవారం సందర్భంగా శివపార్వతులకు విశేష అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు భక్తులు ఓం నమశివాయ నామస్మరణ చేస్తూ స్వామి అమ్మవారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు ఉబయకర్తలుగా సొల్లేటి ప్రసాద్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.



## లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

### పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

### డా. ఈరుగుల అన్నపూర్ణ

తెనాలి, జూలై 22 సింధూరదర్శిని:గర్భంలోని శిశువు లింగాన్ని నిర్ధారించడం, వెల్లడించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, ఇటువంటి అక్రమాలకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలు, వైద్యులపై ఎలాంటి ఉపేక్ష ఉండదని తెనాలి ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. తెనాలి ఉప వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ ఉప జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు.ఆడ శిశువుల జననాన్ని ప్రోత్సహించడం, లింగ వివక్షను నిర్మూలించడం సమాజం బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.గర్భస్థ శిశువు లింగాన్ని తెలుసుకోవడం, చెప్పడం లేదా అలాంటి పరీక్షలకు సహకరించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కేసులు నమోదు చేసి, అవసరమైతే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు.అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, ప్రతి స్కాన్‌కు సంబంధించిన రికార్డులను నిబంధనల మేరకు నిర్వహించాలని ఆదేశించారు. స్కానింగ్ సేవల ధరల పట్టికను ఆసుపత్రిలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 1800-233-2447టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రతి స్కానింగ్ కేంద్రంలో తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు.గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ జరుగుతోందనే అనుమానాలపై ప్రతి నెల డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమాలపై సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేసి సహకరించాలని కోరారు.సమావేశంలో కమిటీ సభ్యులు బోళ్ళ సాంబిరెడ్డి, డా. సంపూర్ణ, డా. కె.సురేష్, డా. వినీల్, పెనుగొండ వెంకటేశ్వరరావు, నాళం శ్రీమన్నారాయణమూర్తి, ముమ్మనేని భానుమతి, డా. నక్కా సుశాన్ గ్రేస్, డా. చందోలు విజేత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆళ్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.


## గదుల నిర్మాణ పనులు, టాయిలెట్ల నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేయాలి



నరసరావుపేట, సింధూరదర్శిని: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతుల గదుల నిర్మాణ పనులు, టాయిలెట్ల నిర్మాణ పనులు త్వరగా తిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల అధికారులను ఆదేశించారు . బుధవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాఠశాల లో అదనపు తరగతి గదుల నిర్మాణం ,టాయిలెట్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చటానికి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడానికి ప్రవేశపెట్టిన కార్యక్రమం మనబడి మన భవిష్యత్తు దీని ముఖ్య ఉద్దేశం ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచటం అని అన్నారు. జిల్లాలో 80 శాతం పనులు పూర్తయిన 60 స్కూళ్లలో 218 అదనపు తరగతి గదులు నిర్మాణం 23 టాయిలెట్ల నిర్మాణానికి 456 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు ఇందులో 31 పాఠశాలలో 116 అదనపు తరగతి గదులు పూర్తయ్యాయని 11 టాయిలెట్లు పూర్తయినట్లు విద్యాశాఖ అధికారి తెలియజేశారు. ఇంకా 29 స్కూల్లో 112 అదనపు తరగతి గదులు 12.టాయిలెట్లు నిర్మాణాలు పురోగతి లో ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

## బిడ్డల బంగారు భవిష్యత్తుకు 'తల్లికి వందనం'

### -ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్ల, సింధూరదర్శిని: రాష్ట్రంలో విద్యా నభ్యసిస్తున్న బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోందని జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తల్లులు ఖాతాల్లో తల్లికి వందనం పథకం నగదు ప్రభుత్వం జమ చేడయం పట్ల ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గం పరిధిలో దాదాపు 40,386 విద్యార్థులకు గానూ 27,732 మంది తల్లుల ఖాతాలో రూ. 60 కోట్ల 57 లక్షల 90 వేల నగదును జయ చేశామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు ఇచ్చిమాటకు కట్టుబడి విద్యార్థుల కోసం రెండో విడత తల్లికి వందనం పథకం అమలు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విద్యలో నాణ్యత ప్రమాణాలకు పెద్దపీఠ వేస్తూ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర , డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాలను ఎంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.

# బాపట్ల పట్టణాన్ని సుందర వనంగా తీర్చిదిద్దుడానికి ప్రట్టణ ప్రజలు సహకరించాలి

### పట్టణంలో ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటలి నీరు పొంచి రక్షించాలి

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

### పచ్చదనంతో బాపట్లను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుదాం - ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు





బాపట్ల :సింధూరదర్శిని: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటి ముందు కనీసం ఒక మొక్కను నాటి, దానికి నిరంతరం నీరు పోస్తూ సంరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం నేచర్ వెల్ ఫర్ కౌన్సిల్ బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో జి బి సి.రోడ్డు లోని మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్ పాయి విగ్రహం సర్కిల్ నుండి కమ్మ కళ్యాణ్ మండపం వరకు మొక్కలు నాటే పర్యావరణ పరిరక్షణ లో బాగంగా - మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తో కలసి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటి ముందు కనీసం ఒక మొక్కను నాటి, దానికి నిరంతరం నీరు పోస్తూ సంరక్షించాలని జిల్లా కలెక్టర్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇంటి ముందు ఒక మొక్కను నాటి, దానిని బిడ్డల మాదిరిగా సంరక్షిస్తే పట్టణం మరింత ఆహ్లాదకరంగా, కాలుష్య రహితంగా మారుతుందని అన్నారు.గత 30 - 40 సంవత్సరాల క్రితం బెంగళూరు నగరంలో ఆలోచించి మొక్కలు నాటడం జరిగిందని బెంగళూరు నగరం సుందరంగా ఉందని బెంగుళూరు నగరానికి దీటుగా బాపట్ల పట్టణాన్ని పచ్చదనంతో నింపాలని ఆకాంక్షిస్తూ, పట్టణ ప్రజలు కోరిన మేరకు వారికి ఏ మొక్కల అవసరం అమొక్కను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. పట్టణ ప్రజలకు కావలసిన మొక్కలు అందజేయడం జరుగుతుంది ఆ మొక్కలకు నీరు పోసి రక్షించవలసిన బాధ్యత పట్టణ ప్రజలపై ఉందని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని బాపట్ల పట్టణాన్ని పచ్చదనంతో నింపేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని బైపాస్ డివైడర్లపై కంపెనీల సామాజిక బాధ్యత (జూ=) నిధుల సహకారంతో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను కూడా సంబంధిత సంస్థలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, వ్యాపార సంస్థలు మొక్కల పెంపకంలో భాగస్వాములై బాపట్లను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలనికోరారు. అనంతరం డైవైడర్ పై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ప్రతినిధులు మొక్కలు నాటి నీరు పోయడం జరిగింది. 410 మొక్కలు అందజేసిన దాత శ్రీమతి తిరువీధుల వాణి ని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ.ఏ హరి కుమార్, డ్వామా పి డి విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ యం. హాసిని, నేచర్ వెల్ ఫర్ కౌన్సిల్ చైర్మన్ అవల వెంకటేశ్వర్లు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ఏ పి బ్రాహ్మణ సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ చివుకుల దుర్గ ప్రసాద్, మానవతా సేవ సంస్థ బాపట్ల సభ్యురాలు కర్పూరపు మంజులత,నేచర్ వెల్ ఫర్ సొసైటీ మెంబర్ దేవర కొండ రాము,తహాశీల్దార్ షేక్ సలీమ, యం పి డి ఓ.బాబూరావు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి

### ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనను ప్రజలకు వివరించండి

### కార్యకర్తలకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దిశానిర్దేశం.



తెనాలి జూలై 22 సింధూరదర్శిని: పార్టీ నిర్ణయించిన ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో అమలు చేస్తేనే ప్రజల్లో పార్టీపై విశ్వాసం మరింత బలపడు తుందని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం తెనాలి రామ లింగేశ్వరపేటలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, బీఎల్‌ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీ బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలతో సమన్వయంగా బూత్ స్థాయిలో సమర్థవంతంగా పనిచేశారని ఆలపాటి ప్రశంసించారు. ఆ కార్యక్రమం ద్వారా ప్రతి బూత్‌పై పూర్తి అవగాహన ఏర్పడిందని, అదే అనుభవాన్ని రానున్న పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణలో వినియోగించాలని సూచించారు. బూత్ కమిటీలను మరింత చురుకుగా చేసి ప్రతి కుటుంబంతో పార్టీకి అనుబంధం పెంచాలని కోరారు.ఈ నెల 27వ తేదీ నుంచి 40 రోజులపాటు నిర్వహించే ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను ప్రతి ఇంటి వద్దకు తీసుకెళ్లి వివరించాలని చెప్పారు. ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న సానుకూలతను మరింత బలోపేతం చేసేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.తల్లికి వందనం పథకం కింద బుధవారం నుంచే అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ అవుతోందని తెలిపారు.కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం విద్యకు ప్రోత్సాహకరమన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటోందని, ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వానికి బలమని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయాలని, ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని పెంచేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించాలని కోరారు.సమావేశంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బీఎల్‌ఏలు, బూత్ కన్వీనర్లు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థిని విద్యార్థులకు చేయూత ఇవ్వటమే ప్రభుత్వం ధ్యేయం

### ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రతినిధులు



అచ్చంపేట సింధూరదర్శిని: అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ మరియు తల్లికి వందనం అనే కార్యక్రమం లో మండల నాయకులు పాల్గొని విద్యను అందించడంలో కూడా కార్పొరేటర్ స్కూలుకు దీటుగా విద్యార్థిని విద్యార్థులకు సరైన బోధన చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రతినిధులు అన్నారు. స్కూల్ అభివృద్ధికి సహకరిస్తున్న జిల్లా కార్యనిర్వాహ కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు చేతుల మీదగా యూనిఫాం అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం హై స్కూల్ హెచ్‌ఎం టి దాస్ మాజీ సర్పంచ్ నెల్లూరు వెంకటయ్య స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్: టాప్ 4లో ముగ్గురు మనోళ్లే.. ఒక్క పాయింట్‌తో గిల్‌కు చేజారిన అగ్రస్థానం!

ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరిన శుభ్‌మన్ గిల్

నంబర్ 1 ర్యాంకర్ డారిల్ మిచెల్‌కు, గిల్‌కు మధ్య కేవలం ఒక్క పాయింటే తేడా

టాప్ 4లో ముగ్గురు భారత బ్యాటర్లు.. కోహ్లీకి 3, రోహిత్‌కు 4వ ర్యాంక్

ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో ర్యాంకును మెరుగుపరుచుకున్న గిల్

బౌలింగ్‌లో రషీద్ ఖాన్ అగ్రస్థానం.. ఆర్చర్ మూడో స్థానానికి

ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానానికి అతి చేరువగా వచ్చాడు. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో నిలకడగా రాణించిన గిల్, బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి దూసుకెళ్లాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ 802 రేటింగ్ పాయింట్లతో నంబర్ 1 స్థానంలో ఉండగా, గిల్ 801 పాయింట్లతో కేవలం ఒక్క పాయింట్ తేడాతో రెండో స్థానంలో నిలిచాడు. త్వరలోనే గిల్ అగ్రస్థానాన్ని అధిరోహించే అవకాశం ఉంది. ఈ జాబితాలో భారత బ్యాటర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. గిల్‌తో పాటు విరాట్ కోహ్లీ 767 పాయింట్లతో మూడో స్థానంలో, కెప్టెన్ రోహిత్ శర్మ 758 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. దీంతో వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ 4లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన




మూడు వన్డేల సిరీస్‌లో గిల్ 188 పరుగులు సాధించడం అతడి ర్యాంకు మెరుగుపడటానికి దోహదపడింది. ఈ సిరీస్‌ను ఇంగ్లండ్ 2-1 తేడాతో గెలుచుకోగా, ఆ జట్టు స్టార్ బ్యాటర్ జో రూట్ అద్భుతంగా రాణించాడు. సిరీస్ మొత్తం అజేయంగా నిలిచి 249 పరుగులు చేసిన రూట్, నాలుగు స్థానాలు ఎగబాకి 8వ ర్యాంకుకు చేరుకున్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ స్పిన్ సంచలనం రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ రెండో స్థానంలో ఉండగా, భారత్‌తో సిరీస్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఒక స్థానం మెరుగుపరుచుకుని మూడో ర్యాంకుకు చేరుకున్నాడు.

భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ 10 స్థానాలు ఎగబాకి 32వ స్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో న్యూజిలాండ్ ఆటగాడు మైఖేల్ బ్రేస్‌వెల్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని కెరీర్‌లోనే ఉత్తమంగా మూడో ర్యాంకుకు చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్ ఈ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# ఒకే కాన్పులో నలుగురు ఆడపిల్లలు..

ఆస్ట్రేలియా జంటకు ఆనందంతో పాటు కొత్త కష్టం! - ఇప్పటికే ఆ జంటకు ముగ్గురు పిల్లలు

ఏడుగురు పిల్లలతో ప్రయాణానికి కారు సరిపోకపోవడంతో కొత్త సమస్య

10 సీట్ల వ్యాన్ కొనుగోలు కోసం ఆన్‌లైన్‌లో విరాళాలు సేకరిస్తున్న తల్లి - కుటుంబానికి అండగా నిలుస్తున్న స్నేహితులు, స్థానిక సమాజం



ఆస్ట్రేలియాలో ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురు ఆరోగ్యవంతమైన ఆడ శిశువులకు జన్మనిచ్చింది. ఇది చాలా అరుదైన ఘటన కాగా, ఈ పరిణామంతో వారి కుటుంబం రాత్రికి రాత్రే రెట్టింపు ఆనందంలో మునిగిపోయింది. అయితే, ఈ సంతోషంతో పాటు వారికి ఒక కొత్త ఆచరణాత్మక సమస్య ఎదురైంది. ఇప్పటికే ముగ్గురు పిల్లలు ఉన్న ఆ దంపతులకు, ఈ నలుగురు శిశువుల రాకతో కుటుంబ సభ్యుల సంఖ్య తొమ్మిదికి చేరింది. దీంతో కుటుంబం మొత్తం కలిసి ప్రయాణించడానికి వారి వద్ద ఉన్న కారు సరిపోవడం లేదు. బీబీసీ కథనం ప్రకారం.. మొత్తం ఏడుగురు పిల్లల సంరక్షణ బాధ్యతలు చూసుకోవాల్సి రావడంతో ప్రస్తుత కారులో అందరికీ సురక్షితంగా ప్రయాణించేందుకు సీట్లు సరిపోవడం లేదు. ఈ పెరుగుతున్న అవసరాలను తీర్చుకోవడానికి, 10 సీట్ల వ్యాన్‌ను కొనుగోలు చేసేందుకు ఆ తల్లి ఆన్‌లైన్‌లో విరాళాల సేకరణ ప్రచారాన్ని ప్రారంభించింది. కొత్త వాహనం అందుబాటులోకి వస్తే, పిల్లలను ఆసుపత్రికి తీసుకెళ్లడం, స్కూల్ కు వెళ్లి రావడం, ఇతర కుటుంబ ప్రయాణాలు చాలా సులభతరం అవుతాయని ఆమె భావిస్తున్నారు.

ఒకేసారి నలుగురు ఆడపిల్లలు పుట్టడం తమ జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని ఆశీర్వాదమని ఆ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే, ఇంత పెద్ద మార్పునకు సిద్ధం కావడానికి డైపర్లు, ఫార్ములా, దుస్తులు వంటి రోజువారీ ఖర్చులతో పాటు గణనీయమైన ఆర్థిక వనరులు అవసరమని వారు అంగీకరించారు. వీటన్నింటికంటే ముఖ్యంగా కుటుంబం మొత్తం కలిసి ప్రయాణించడానికి నమ్మకమైన రవాణా సౌకర్యం తమకు అత్యంత ప్రాధాన్యత అంశంగా మారిందని వివరించారు. ఈ కష్ట సమయంలో స్నేహితులు, శ్రేయోభిలాషులు ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నారని, ఒకేసారి నలుగురు నవజాత శిశువుల ఆలనాపాలనలో వారికి సహాయం అందిస్తున్నారని బీబీసీ తన కథనంలో పేర్కొంది. ఈ అసాధారణ జననంపై విస్తృతంగా ప్రచారం జరగడంతో, చాలామంది ఆ తల్లిదండ్రులను ప్రశంసిస్తూ, వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రస్తుతం తమ ఏడుగురు పిల్లలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన వాహనం, ఇతర వనరులను సమకూర్చుకోవడంపైనే తాము పూర్తి దృష్టి సారించినట్లు ఆ కుటుంబం తెలిపింది.



# ఈ20 పెట్రోల్‌తో ఇంజిన్‌కు ఎలాంటి నష్టం ఉండదు: కేంద్రం

మైలేజీపై ఇథనాల్ శాతంతో పాటు డ్రైవింగ్ తీరు, వాహనం నిర్వహణ అంశాల ప్రభావం

ఈ20 పెట్రోల్‌తో అధిక ఆక్టేన్ విలువ, మెరుగైన దహన సామర్థ్యం వంటి ప్రయోజనాలు

ఈ20 (20 శాతం ఇథనాల్ మిశ్రమం) పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజిన్‌లు దెబ్బతింటాయన్న ప్రచారంలో నిజం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఈ10 పెట్రోల్‌కు అనుగుణంగా రూపొందించిన కొన్ని పాత వాహనాల్లో మైలేజీ 3-5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని రాజ్యసభలో తెలిపింది. మైలేజీపై ఇథనాల్ శాతంతో పాటు డ్రైవింగ్ తీరు, వాహనం నిర్వహణ, టైర్లలో గాలి ఒత్తిడి, వీల్ అలైన్‌మెంట్, ఏసీ వినియోగం వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయని కేంద్రం పేర్కొంది. అదే సమయంలో ఈ20 పెట్రోల్‌తో అధిక ఆక్టేన్ విలువ, మెరుగైన దహన సామర్థ్యం, ఇంజిన్‌లో నాకింగ్ తగ్గడం, వాహనం సాఫీగా పికప్ తీసుకోవడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని వివరించింది. ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఈ20 పెట్రోల్‌పై వస్తున్న విమర్శలను ఖండించారు. ఈ20 వల్ల ఏ ఒక్క కారు దెబ్బతిన్నట్లు ఆధారాలు లేవని, ఇలాంటి ఆరోపణలు తప్పుడు ప్రచారంలో భాగమేనని ఆయన వ్యాఖ్యానించారు.

# వైభవ్ సూర్యవంశీ లాంటి ప్రతిభ ఉన్న ఆటగాణ్ని చూడలేదు: హర్భజన్

వైభవ్ ఆటతీరుపై మాజీ స్పిన్ దిగ్గజం ప్రశంసలు

నిర్భయంగా ఆడుతున్న తీరు అద్భుతమన్న హర్భజన్


ఐపీఎల్ అరంగేట్రానికి ముందు నాటి సంఘటన గుర్తు చేసుకున్న మాజీ స్పిన్నర్

తొలి బంతిని ఎలా ఆడతావంటే.. అనుకూలంగా వస్తే సిక్స్ కొడతానన్నాడని వెల్లడి



టీమిండియా యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. 15 ఏళ్ల వయసులోనే ఎలాంటి భయం లేకుండా అతడు ఆడుతున్న తీరు అద్భుతమని కొనియాడాడు. తన కెరీర్‌లో ఇలాంటి ప్రతిభ ఉన్న ఆటగాణ్ని ఎప్పుడూ చూడలేదని చెప్పాడు. యువ ఆటగాళ్లు తమ సహజ శైలిలో ఆడేందుకు ఇప్పుడు భారత క్రికెట్‌లో మంచి వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నాడు. వైభవ్ ఐపీఎల్ అరంగేట్రానికి ముందు జరిగిన ఓ సంఘటనను కూడా హర్భజన్ గుర్తు చేశాడు. తొలి బంతిని ఎలా ఆడతావని కోచ్ రాహుల్ ద్రవిడ్ అడగ్గా, తనకు అనుకూలంగా వస్తే సిక్సర్ కొడతానని వైభవ్ చెప్పాడని, చెప్పినట్టుగానే శార్దూల్ ఠాకూర్ వేసిన తొలి బంతికే సిక్సర్ బాదాడని వెల్లడించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించాడు. తొలి సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, జింబాబ్వేతో జరగనున్న టీ20 సిరీస్‌కు అతడిని మళ్లీ ఎంపిక చేయడంతో తన ప్రతిభను నిరూపించుకునే మరో అవకాశం లభించింది.

# మీ ఇంటికి కొత్త కళ.. 2026లో సరికొత్త డిజైన్ ట్రెండ్స్ ఇవిగో!



ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు, ఖరీదైన ఫర్నిచర్ కాదు. అది మన వ్యక్తిత్వానికి, మన అనుభూతులకు అద్దం పట్టే ఒక ప్రత్యేక ప్రపంచం. ఫోటోలలో అందంగా కనిపించడం కంటే, మనసుకి ప్రశాంతతను ఇచ్చేలా ఉండాలి. సరిగ్గా ఇదే విషయాన్ని ప్రతిబింబిస్తూ 2026 ఇంటీరియర్ డిజైన్ ట్రెండ్స్ రాబోతున్నాయి. కృత్రిమమైన 'పర్ఫెక్షన్', కచ్చితమైన కొలతలతో కూడిన 'మినిమలిజం' స్థానంలో... మనసును హత్తుకునే, మన కథను చెప్పే డిజైన్లకు ప్రాధాన్యం పెరగనుంది. 'అవుట్ లుక్ ఇండియా' కథనం ప్రకారం, 2026లో ఇంటి అలంకరణ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఆ కొత్త ట్రెండ్స్ ఏంటో వివరంగా చూద్దాం.

2026లో ఇంటీరియర్ డిజైన్‌ను శాసించబోయే 9 ట్రెండ్స్:

**1. జెంటిల్ క్లటర్**

ఇది చిందరవందర కాదు. మనకు ఇష్టమైన, జ్ఞాపకాలున్న వస్తువులను అందంగా అమర్చుకోవడం. బాగా చదివిన పుస్తకాలు, ఇష్టమైన కాఫీ కప్పులు, పర్యటనలలో కొన్న జ్ఞాపికలు, వారసత్వంగా వచ్చిన వస్తువులను దాచిపెట్టకుండా, ఇంటి అలంకరణలో భాగం చేయడమే ఈ ట్రెండ్ ఉద్దేశ్యం.

**2. సహజమైన మెటీరియల్స్**

రాయి, గచ్చు, కలప, నార, మట్టి వంటి సహజమైన వస్తువుల వాడకం పెరుగుతుంది. వీటిలోని గరుకుదనం, సహజమైన గీతలు ఇంటికి ప్రత్యేకమైన అందాన్ని, మనసుకు ఓదార్పునిస్తాయి. స్పర్శకు సైతం హాయిగా అనిపించే వాతావరణాన్ని సృష్టిస్తాయి.

**3. లైటింగ్ ఒక అనుభూతి**

లైట్లు కేవలం వెలుతురు కోసం కాదు, మన మూడ్‌ను మార్చే సాధనంగా మారనున్నాయి. గదిలో వేర్వేరు చోట్ల అమర్చిన లాకెట్లు, ఫ్లోర్ ల్యాంప్స్, వాల్ లైట్స్... ఉదయం పూట ప్రకాశవంతంగా, సాయంత్రం వేళ వెచ్చని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయి.

**4. ఆర్నమెంట్స్‌కు మళ్లీ చోటు**

అతిగా కాకుండా, అలంకరణకు సూక్ష్మమైన మెరుగులు దిద్దడం మళ్లీ వాడుకలోకి వస్తుంది. కుషన్లకు అంచులు, దీపాల షేడ్లకు వేలాడే టాసెల్స్, సోఫా కవర్లకు అందమైన ఫ్రింజ్ వంటివి ఇంటికి కదలికను, కొత్తదనాన్ని ఇస్తాయి.

**5. నిశ్శబ్ద నైపుణ్యం**

ఆర్భాటం లేని, నాణ్యమైన చేతిపనికి డిమాండ్ పెరుగుతుంది. చూడగానే ఆకట్టుకోవడం కంటే, వాడేకొద్దీ దాని నాణ్యత, మన్నిక తెలిసేలా ఉండే వస్తువులను ఎంచుకోవడం ముఖ్యం. ఇది దీర్ఘకాలం మన్నేలా ఇంటిని తీర్చిదిద్దడంలో సహాయపడుతుంది.

**6. వెచ్చని న్యూట్రల్స్**

తెలుపు రంగులో మృదువైన, వెచ్చని షేడ్స్ ప్రాచుర్యం పొందుతాయి. ఒకే రంగులోని వివిధ షేడ్స్‌ను ఉపయోగించడం ద్వారా గదికి లోతు, ప్రశాంతత వస్తాయి. వేగవంతమైన జీవితంలో ఇది మనసుకు విశ్రాంతిని అందిస్తుంది.

**7. రిచ్ బ్రౌన్ రంగుల వైభవం**

నలుపుకు బదులుగా డార్క్ చాక్లెట్, ఎస్ప్రెస్సో బ్రౌన్ వంటి ముదురు గోధుమ రంగులు గోడలకు, ఫర్నిచర్‌కు కొత్త అందాన్నిస్తాయి. ఈ రంగులు ఇంటికి వెచ్చదనాన్ని, విలాసవంతమైన అనుభూతిని అందిస్తాయి.

**8. ఎండకు వెలిసిన రంగులు**

ఎండకు కొద్దిగా వెలిసినట్టుగా ఉండే మృదువైన రంగులు ట్రెండ్‌గా మారనున్నాయి. ఆవపసుపు, ఆలివ్ గ్రీన్, టెర్రకోట వంటి రంగులు ఇంటికి ప్రకృతితో సంబంధం ఉన్నట్లు, ఓ పాత జ్ఞాపకంలా హాయిగా అనిపిస్తాయి.

**9. ఆత్మవిశ్వాసంతో కూడిన మిశ్రమం**

వివిధ కాలాలకు, శైలులకు చెందిన వస్తువులను ధైర్యంగా కలిపి ఉపయోగించడం ఈ ట్రెండ్ ప్రత్యేకత. ఆధునిక సోఫాతో పాతకాలం నాటి రగ్గు లేదా తాతల నాటి కుర్చీ... ఇలా మీ వ్యక్తిగత కథను, అభిరుచిని ప్రతిబింబించేలా ఇంటిని మార్చుకోవచ్చు.

మొత్తం మీద, రాబోయే రోజుల్లో ఇల్లు అనేది నియమాలతో కట్టిన కట్టడంలా కాకుండా, మనసు చెప్పినట్టు నడుచుకునే, మన భావోద్వేగాలను పంచుకునే ఒక స్నేహితుడిలా మారబోతోందని స్పష్టమవుతోంది.

# సినిమా న్యూస్



ప్రకృతి పావని బికినీ బ్లిస్: సన్, సాండ్, మరియు స్టైల్ ఆమె కెమెరా ముందు పూర్తిగా ప్రశాంతంగా కనిపించింది, ప్రతి క్లిక్‌ని చిత్రంగా పరిపూర్ణంగా మార్చే రిలాక్స్డ్, బీచ్ వైబ్‌లను వెదజల్లింది.

## సుజీత్ పై నమ్మకం ఎందుకు పెరుగుతోంది?



టాలీవుడ్‌లో దర్శకుల కెరీర్ ఒక్క సినిమాతోనే మారిపోవడం కొత్త విషయం కాదు. అయితే తక్కువ సమయంలోనే స్టార్ హీరోలతో వరుస అవకాశాలు అందుకోవడం మాత్రం కొంతమందికే సాధ్యమవుతుంది. ప్రస్తుతం అలాంటి దర్శకుల జాబితాలో సుజీత్ పేరు ముందువరుసలో కనిపిస్తోంది. చిన్న సినిమాతో దర్శకుడిగా పరిచయమైన ఆయన.. ఇప్పుడు ఇండస్ట్రీలో అత్యంత బిజీ దర్శకుల్లో ఒకరిగా మారారు. 2014లో విడుదలైన రన్ రాజా రన్ తో సుజీత్ దర్శకుడిగా పరిచయమయ్యారు. శర్వానంద్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా కథను చెప్పిన విధానం, స్క్రీన్ ప్లేకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. తొలి సినిమాతోనే తనపై ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుజీత్.. ఆ తర్వాత ఊహించని స్థాయిలో అవకాశాలు అందుకున్నారు. బాహుబలి తర్వాత ప్రభాస్‌తో సినిమా చేసే అవకాశం రావడం అప్పట్లో ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ అంచనాల మధ్య వచ్చిన సాహో మిక్స్ డ్ రెస్పాన్స్ అందుకున్నప్పటికీ, యాక్షన్ సన్నివేశాలు, టెక్నికల్ వాల్యూస్ విషయంలో సుజీత్ కు ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా పెద్ద బడ్జెట్ చిత్రాన్ని హ్యాండిల్ చేయగల స్టామినా ఆయనకు ఉందని సినీ ప్రియులు అభిప్రాయపడ్డారు. సాహో తర్వాత సుజీత్ నుంచి సినిమా రావడానికి కొంత సమయం పట్టింది. అయితే ఆయన పేరు మాత్రం ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు వినిపిస్తూనే వచ్చింది. స్టార్ హీరోలకు కథలు వినిపించడం, కొత్త ప్రాజెక్టులపై చర్చలు జరపడం వంటి అంశాలు తరచూ వార్తల్లో నిలిచాయి. ఇదే సమయంలో పవన్ కళ్యాణ్ ఓజీ మూవీ తర్వాత ఆయన వర్క్ స్టైల్ పై హీరోల్లోనూ నమ్మకం పెరిగినట్లు అంతా చెబుతుంటారు. ఇప్పుడు ఆయన లైనప్ లో ఉన్న ఓజీ 2పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ఇంకా షూటింగ్ మొదలుకాకముందే ఆ ప్రాజెక్టుపై భారీగా చర్చ జరుగుతుండటం విశేషం. అంతే కాదు ఆ మూవీ అప్ కమింగ్ అప్డేట్ కోసం అంతా ఇప్పుడు డిస్కస్ చేసుకుంటున్నారు. ఒకవైపు పవన్ స్టార్ డమ్, మరోవైపు సుజీత్ టేకింగ్ పై ఉన్న నమ్మకం.. ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. సుజీత్ విషయంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. ఆయన సినిమాల్లో కనిపించే స్టైలిష్ ప్రెజెంటేషన్. ఈమె బ్యాక్ గ్రౌండ్ ఏంటంటే? పాత్రల డిజైన్ నుంచి యాక్షన్ ఎపిసోడ్స్ వరకు ప్రతి అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారని ఇండస్ట్రీలో పేరుంది. అందుకే ఆయనకు వరుసగా పెద్ద ప్రాజెక్టులు వస్తున్నాయని సినీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. ఇప్పటికే చిన్న సినిమా నుంచి పాన్ ఇండియా స్థాయి చిత్రాల వరకు ప్రయాణించిన సుజీత్.. రానున్న రోజుల్లో మరిన్ని భారీ అవకాశాలు అందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. కథపై నమ్మకం, టెక్నికల్ గా స్ట్రాంగ్ ప్రెజెంటేషన్, స్టార్ హీరోలను డీల్ చేసే స్టామినా.. ఆ మూడు అంశాలే సుజీత్ పై ఇండస్ట్రీ నమ్మకం పెరగడానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అలా టాలీవుడ్ లో యువ దర్శకులలో సుజీత్ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు

## హీరోయిన్ సింగింగ్‌తో బై లింగువల్ బజ్

సినిమా ప్రమోషన్స్ విధానం గత కొన్నేళ్లలో పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లు, ప్రీ రిలీజ్ ఈవెంట్లకే పరిమితమైన ప్రమోషన్స్ ఇప్పుడు సోషల్ మీడియా కేంద్రంగా విస్తరించింది. ముఖ్యంగా ఆడియన్స్ తో డైరెక్ట్ గా కనెక్ట్ అయ్యే కంటెంట్‌కు ఎక్కువ ప్రాధాన్యం పెరగడంతో హీరోయిన్లు కూడా కేవలం యాక్టింగ్ తోనే కాకుండా తమలోని వేరే టాలెంట్స్ ను కూడా బయటపెడుతూ సినిమాలకు స్పెషల్ ఎట్రాక్షన్ గా మారుతున్నారు. సింగింగ్, డ్యాన్సింగ్, లైవ్ ఇంటరాక్షన్స్, షార్ట్ వీడియోస్ వంటి



అంశాలు ఇప్పుడు ప్రమోషనల్ క్యాంపెయిన్‌లో కీలక భాగంగా మారుతున్నాయి. ఈ మారుతున్న ట్రెండ్‌కు తాజాగా చెన్నై లవ్ స్టోరీ ప్రమోషన్స్ మరో ఉదాహరణగా నిలిచాయి. ఈ సినిమా ప్రమోషన్స్ లో హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, సూర్య నటించిన సూర్య సన్నాఫ్ కృష్ణన్ సినిమాలోని సాంగ్‌ను తెలుగు, తమిళ భాషల్లో ఆలపించి ఆడియన్స్ దృష్టిని ఆకర్షించింది. రెండు భాషలను ఒకే సాంగ్ లో కలిపి పాడటం ద్వారా తెలుగు, తమిళ ఆడియన్స్ తో ఒకేసారి బాండింగ్ ను పెంచే ప్రయత్నం చేసింది. బైలింగ్వల్ లేదా రెండు మార్కెట్లను టార్గెట్ గా పెట్టుకున్న సినిమాలకు ఇలాంటి ప్రమోషనల్ ఆలోచనలు మరింత ఉపయోగపడతాయని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు వేగంగా వైరల్ కావడం కూడా సినిమాపై అదనపు ఆసక్తిని తీసుకువస్తోంది. ప్రస్తుతం హీరోయిన్ల కెరీర్‌లో మల్టీ టాలెంట్ ఒక పెద్ద అడ్వాంటేజ్‌గా మారుతోంది. మంచి నటిగా ఉండటమే కాకుండా సింగింగ్, స్టేజ్‌పై ఫ్యాన్స్ ను అలరించడం, సోషల్ మీడియాలో నేచురల్ గా కమ్యూనికేట్ చేయడం వంటి నైపుణ్యాలు వారి పర్సనల్ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేస్తున్నాయి. దీంతో ఆడియన్స్ కు వారు సినిమాల్లో కనిపించే పాత్రలకే పరిమితం కాకుండా పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్లుగా గుర్తుండిపోతున్నారు. గౌరీ ప్రియ కూడా అదే దిశగా తన ప్రత్యేక గుర్తింపును నిర్మించుకునే ప్రయత్నం చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ తరహా ప్రమోషన్స్ సినిమా రిలీజ్‌కు ముందే పాజిటివ్ డిస్కషన్ ను తీసుకురావడంతో పాటు, కొత్త తరం హీరోయిన్లు తమ టాలెంట్ ను విభిన్న కోణాల్లో ప్రదర్శించేందుకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయి.

## చందమామ సెకెండ్ ఇన్నింగ్స్ ఊపెక్కడ?



దశాబ్దంన్నరకు పైగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో చందమామగా వెలిగిపోయిన కథానాయిక కాజల్ అగర్వాల్. ఎంతో మంది అగ్రనటుల సరసన నటించింది. స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసింది. అయితే 2020లో వివాహం చేసుకున్న తర్వాత సినిమాల్లో వేగం ఒక్కసారిగా తగ్గింది. పెళ్లి తర్వాత కూడా నటనను కొనసాగి స్తున్నప్పటికీ? గతంలో ఉన్నంత జోరు సెకండ్ ఇన్నింగ్స్‌లో కనిపించడం లేదు. ఈ నాలుగైదు ఏళ్లలో ఆమె చేసిన చిత్రాల సంఖ్య చాలా పరిమితంగా ఉండటంతో అమ్మడు చర్చనీయాంశమవుతోంది. వివాహానంతరం కాజల్ ఎంచుకున్న ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద సందడి చేయలేకపోయాయి. కమర్షియల్ చిత్రాలకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక చిత్రాలపై దృష్టి సారించినా? అవి ప్రేక్షకులను పూర్తిస్థాయిలో అలరించడంలో విఫలమయ్యాయి. ఒకప్పుడు వరుస హిట్లు అందుకున్న కాజల్ ఇప్పుడు సరైన సక్సెస్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అమ్మడి కెరీర్ గ్రాఫ్ గతంతో పోలిస్తే మందగించడానికి కథల ఎంపిక కూడా ప్రధాన కారణమని వాదనా లేకపోలేదు. అలాగే పాత్రల ఎంపికలో కాజల్ విధించుకున్న గ్లామర్ హద్దులు కూడా అవకాశాలను ప్రభావితం చేశాయన్నది ఇండస్ట్రీ వర్గాల మాట. గ్లామర్ పాత్రలకు పెట్టింది పేరుగా ఉన్న కాజల్ పెళ్లి తర్వాత ఆ హద్దులను మార్చుకోవడం వల్ల కొన్ని భారీ కమర్షియల్ ప్రాజెక్టులు చేజారి ఉండొచ్చు. ఇప్పటి తరం ప్రేక్షకులు , దర్శక నిర్మాతలు, కథ డిమాండ్‌కు తగ్గట్టుగా పాత్రలు ఉండాలని ఆశిస్తున్నారు. కాజల్ పాత ఇమేజ్‌కు భిన్నంగా వెళ్లడం వల్ల దర్శక నిర్మాతల ఆలోచనల్లో ఆమె స్థానం మారి ఉండొచ్చు. టాలీవుడ్‌లో మారుతోన్న ట్రెండ్స్ కూడా ఆమెకు సవాలుగా మారాయి. ప్రస్తుతం పరిశ్రమలో కొత్త నటీమణుల రాక పెరగడం, కథల్లో హీరోయిన్ల పాత్రల స్వభావం పూర్తిగా మారిపోవడంతో కాజల్ వంటి సీనియర్ తారలు తమను తాము మలచుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం గ్లామర్ హీరోయిన్‌గా కాకుండా? క్యారెక్టర్ ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో నటించాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించినట్లు కనిపిస్తోంది. కానీ అలాంటి పాత్రలు ఆమెకు లభించడం ప్రస్తుతానికి కష్టంగానే ఉంది. అయితే కాజల్ అగర్వాల్‌కు ఉన్న స్టార్ డమ్ అంత సులువుగా చెరిగిపోయేది కాదు. ఆమెకు ఇప్పటికీ మార్కెట్‌లో మంచి క్రేజ్ ఉంది. సరైన దర్శకుడు, పవర్‌ఫుల్ స్క్రిప్ట్ దొరికితే మళ్ళీ పూర్వ వైభవాన్ని అందుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇటీవలి కాలంలో వివాహం చేసుకున్న ఎంతోమంది నటీమణులు రెండవ ఇన్నింగ్స్‌లో అద్భుతమైన పాత్రలతో ఫామ్‌లోకి వచ్చిన ఉదాహరణలున్నాయి. కాజల్ కూడా ఎంపికలో మార్పులు చేసుకుంటే? మళ్ళీ సంచలనాలు సృష్టించడం ఖాయం. కాజల్ అగర్వాల్ సెకండ్ ఇన్నింగ్స్ నెమ్మదిగా సాగుతున్నా? కమ్ బ్యాక్ కోసం అభిమానులు వేచి చూస్తున్నారు. గ్లామర్ పరిమితులు అనేవి ఒక దశ వరకే పరిమితం. కానీ కాజల్ అనుభవం, నటన వెలకట్టలేనివి. రాబోయే రోజుల్లో కాజల్ పాత్రల ఎంపికలో వైవిధ్యం చూపిస్తే? మళ్ళీ బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేస్తుందని అభిమానులు ఆశీస్తున్నారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662